క్లుప్తంగా

పేదలకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న మాజీ సర్పంచ్ దంపతులు

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ తీళ్ల సుభద్రమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు దంపతులు ఆదివారం నూతన గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో గల పలువురు పేదలకు అన్నదానంతో పాటు వస్త్రదానం చేశారు.

పొలం గట్లపై కూరగాయల పంట



బుడ్డిపేట వద్ద వరిచేను గట్లపై సాగు చేస్తున్న చిక్కుడు పంట

సీతానగరం: మండలంలో ఖరీఫ్ వరి పంట సాగు చేస్తున్న పొలం గట్లపై రైతులు వివిధ రకాల ఆకుకూరలు, కాయకూరల పంటలను సాగు చేస్తున్నారు. ఈ మేరకు వెంకటాపురం, లక్ష్మీపురం, బగ్గందొరవలస తామరఖండి, బుడ్డిపేట గ్రామాల్లో రైతులు వరిచేను పొలం గట్లపై బెండ, చిక్కుడు, వంకాయ పంటలు వేసి ఇంటికి సరిపడా కూరగాయలు పండిస్తున్నారు.

200 మంది రోగులకు వైద్యపరీక్షలు



రోగిని తనిఖీచేస్తున్న వైద్యాధికారి భరత్‌కుమార్

మక్కువ: స్థానిక ఎస్ఎన్.పాఠశాలలో బొబ్బిలికి చెందిన సంజీవిని ఎముకలు, చర్మవ్యాధుల ఆస్పత్రి వైద్యులు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు బంకురు భరత్‌కుమార్, పి.లోహిసాయి రాజ్యలక్ష్మి 200 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. శస్త్రచికిత్సలు అవసరమైన రోగులను గుర్తించారు.

బంగారు గొలుసు మాయం!

పార్వతీపురం రూరల్: పట్టణానికి చెందిన ఓ మహిళ కొనుగోలు చేసిన కొద్దిసేపటికే తన అరతులం బంగారు గొలుసును పోగొట్టుకుంది. కురుపాంకు చెందిన తంగుడు లక్ష్మి పట్టణంలో గల ఓ నగల దుకాణంలో చైన్ కొనుగోలు చేసి, తన బట్టల బ్యాగులో భద్రపరుచుకుంది. అనంతరం తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని బస్సు ఎక్కాక బ్యాగును పరిశీలించగా, అందులో బంగారు చైన్ కనిపించలేదు. దీంతో బాధితురాలు వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవింద తెలిపారు

అయ్యప్ప సన్నిధానం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ నారాయణరావు

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలస కంతపోలమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆదివారం అయ్యప్ప సన్నిధానం నిర్మాణానికి స్థానిక గురుస్వామి, సర్పంచ్ నారాయణరావు భూమిపూజ చేశారు. ఈ మేరకు నిర్వాహకుడు, సర్పంచ్ నారాయణరావు మాట్లాడుతూ దసరా ఉత్సవాల అనంతరం అయ్యప్ప మాలలు వేయనున్నందున అయ్యప్ప భక్తులకు సన్నిధానం నిర్మాణం ప్రారంభించామన్నారు. దీర్ఘకాలంగా సన్నిధానం నిర్మించాలని సంకల్పించడంతో నేటికి పని పూర్తవుతోందని తెలియజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

మక్కువలో భారీ వర్షం



మక్కువలో వర్షం కురుస్తున్న దృశ్యం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. సుమారు గంట పాటు వర్షం కురవడంతో ప్రధాన రహదారి, బీసీకాలనీ సమీపంలోని రహదారులపై వరదనీరు ప్రవహించింది. రెండురోజులుగా ఉక్కపోతతో విలవిలాడుతున్న ప్రజానీకం వర్షంతో ఉపశమనం పొందారు. సాయంత్రం సమయంలో వర్షం కురవడంతో, చిరువ్యాపారులు తమ వస్తువులు కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు.

పంట నష్టం అంచనాపై
వింత జవాబు..!



ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

- అటవీశాఖ తీరుతో ఆందోళనలో బాధిత రైతులు

పార్వతీపురం రూరల్:

ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళకళలాడుతూ పొలాల్లో పలకరిస్తున్న నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తే కొన్ని ఆశలైనా తీరుతాయన్న రైతన్నల్లో మళ్లీ 11 నెలల తరువాత పార్వతీపురం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పార్వతీపురం మండలంలోని బండిదొరవలస, చినమరికి, పెదమరికి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఐదురోజులుగా ఏనుగులు సంచరిస్తూ చీకటి పడగానే పంట పొలాలపై విరుచుకు పడుతున్నాయి. పాలుపోసుకుని, కంకులు వేసి చేతికొచ్చే దశలో వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేస్తూ కాళ్లతో తొక్కి, తొండాలతో పీకి సర్వనాశనం చేస్తున్నాయి. వేలాది రూపాయలు అప్పులు చేసి రేయంబవళ్లు కష్టపడి సాగు చేసిన పంట కళ్ల ఎదుటే ధ్వంసం అవుతుండడంతో ఆయా గ్రామాల రైతులు తలలు పట్టుకుంటున్నారు. రాత్రి అయితే బిక్కుబిక్కుమంటూ గడుపుతూ తెల్లారేసరికి పొలమంతా నాశనమై ఉంటుందో, మా కష్టం ఏనుగుల పాలవుతుందో అని ఆందోళన చెందుతున్నారు.



ఏనుగుల సంచారంతో పూర్తిగా పాడైన వరిచేను

అయోమయంలో రైతులు

ఒక వైపు పంట నష్టంతో కుంగిపోతున్న రైతులకు అటవీశాఖాధికారుల వైఖరి మరింత ఆవేదన కలిగిస్తోంది. నష్టపోయిన పంట వివరాలు నమోదు చేసి పరిహారం అందించాలని కోరుతున్న రైతులకు వింత సమాధానం ఎదురవుతోంది.ఏనుగుల గుంపు ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లేంత వరకు నష్టాన్ని అంచనా వేయలేమని ఇది తమ నిబంధన అని అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. ఈ సమాధానంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏనుగులు ఎప్పుడు వెళ్తాయో? లేదంటే ఇక్కడే ఉంటాయో తెలియని నేపథ్యంలో అవి వెళ్లేసరికి మిగిలిన అరకొర పంట కూడా దక్కదని అలాంటి పరిస్థితుల్లో అప్పుడు అధికారులు వచ్చి ఏం అంచనావేస్తారంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టం జరిగిన వెంటనే అంచనా వేస్తేనే వాస్తవ పరిస్థితి తెలుస్తుందని, ఆలస్యం చేస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతులు వాపోతున్నారు.



చినమరికి సమీపంలో గల వరిచేనులో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

నష్టపరిహారం చెల్లించాలి

నాలుగు రోజుల నుంచి ఏనుగుల గుంపు మా ప్రాంతంలో మొక్కజొన్న పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. అందులో మాది ఒక ఎకరా మొక్కజొన్న పంటకు నష్టం జరిగింది. ఈ మేరకు అందుబాటులో ఉన్న అటవీశాఖ అధికారులను నష్టపరిహారం చెల్లించేందుకు పంట నష్టం అంచనా వేయాలని కోరినప్పటికీ ఏనుగుల గుంపు ఈ ప్రాంతం నుంచి తరలివెళ్లిన తరువాతే అంచనా వేస్తామని సమాధానం ఇస్తున్నారు. అవి ఎప్పుడు వెళ్తాయో అధికారులు ఎప్పుడు అంచనా వేస్తారో అర్థం కాని పరిస్థితుల్లో ఆందోళనకు గురవుతున్నాం. జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా వెంటనే పరిశీలించి పంట నష్టం అంచనా వేస్తే బాగుంటుందని అధికారులను విన్నవించుకుంటున్నాం.

– కె.గౌరునాయుడు, చినమరికి, మొక్కజొన్న రైతు

జగన్న కాలనీల్లో అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో అర్ధాంతరంగా నిలిచి పోయిన రోడ్లు, ఇతర పనులు పూర్తిచేసి కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ, శ్రీరాములునాయుడు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ హయాంలో ప్రతిగ్రామానికి ప్రభుత్వం భూమిని సేకరించి పేదలకు పక్కా గృహాలు మంజూరు చేసి, నిర్మాణాలు పూర్తయి గృహప్రవేశాలు జరిగాయని మరికొన్ని చోట్ల రాకపోకల సౌకర్యంలేక, వర్షాలు కురవడం వల్ల పనులు అసంపూర్తిగా నిలిచి పోవడం, రహదారి సౌకర్యాలు కల్పించే లోగా ప్రభుత్వం మారడం వల్ల పనులు నిలిచి పోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెదభోగిలిలో జగనన్న లేవుట్‌లో వందకు పైగా గృహాలు పూర్తయ్యాయని లబ్ధిదారులు ఇళ్లలో ప్రవేశించడానికి రహదారి సౌకర్యం లేదన్నారు. అలాగే కాశీపేట, జోగింపేట, వెంకటాపురం, లక్ష్మీపురం, నిడగల్లు, జానుమల్లువలస జగనన్న కాలనీల్లో రహదారులు సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి తాగునీరు, రోడ్లు, విద్యుదీకరణ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ జిల్లా, మండల నాయకులు ఆర్వీ పార్థసారథి, వై.గోపాలనాయుడు, బి.సూర్యనారాయణ, ఏగిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడలేని బస్‌స్టాప్



సీతానగరం బస్టాప్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సీతానగరం: మండల కేంద్రం నుంచి దూర ప్రాంతానికి రాకపోకలు నిర్వహించే మూడుమండలాల ప్రజలు, ప్రయాణికులు సేదదీరేందుకు నిలువ నీడలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. స్థానిక బస్టాప్ వద్ద సుమిత్రాపురం, పెదంకలాం, అజ్జాడ, ముగడాం తదితర గ్రామాల నుంచి మక్కువ వెంకటభైరిపురం బగ్గందొరవలస తదితర గ్రామాలనుంచి తర ప్రాంతాలకు వెళ్లవలసిన ప్రయాణికులు హైవే రోడ్డు ప్రధాన రహదారిపై సీతానగరం బస్టాప్ నుంచి రాకపోకలు చేస్తారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మహిళల కోసం ఫ్రీబస్ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అంటున్నారు. దూరప్రాంతాలకు ప్రయాణం చేయాల్సిన పురుషులైతే ఏదోవిధంగా నీడ చూసుకుని, కాలకృత్యాలు తీర్చుకునేందుకు నదివైపు వెళ్తుండే వారు. అదే దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు ప్రత్యేక అవసరాలు తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. అలాగే నిలువ నీడలేక అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మహిళలకు అవసరమైన సౌకర్యాలు, విశ్రాంతి భవనం నిర్మించాలని కోరుతున్నారు.

మహా చండీ అవతారంలో అమ్మవారు



అజ్జాడలో అమ్మవారిని మహాచండీదేవి అవతారంలో అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు

బలిజిపేట: మండలంలోని అజ్జాడలో శ్రీ విజయ దుర్గా భవానీ ఆలయంలో అమ్మవారిని మహాచండీ అవతారంలో అలంకరించి పూజలు చేశారు. అర్చకుడు బి.రామలింగస్వామి ఆధ్వర్యంలో మహిళలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



సాలూరు: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి



సీతానగరం : మరిపివలసలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

సాలూరు: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా సాలూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్, గౌరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, నవోదయ యువసేవాసమితి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 35 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మీ కోసం' వెబ్‌సైట్‌లో పీజీఆర్ఎస్ వివరాల నమోదు

- కలెక్టర్ డా.ఎస్ ప్రభాకర్‌రెడ్డి



పార్వతీపురం రూరల్: మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సరైన వివరాలతో పీజీఆర్ఎస్ సమస్యల అర్జీలను నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి తెలిపారు. అలాగే పతిరోజు ప్రజలు తమ సమస్యలపై వినతులను అందజేసేందుకు కలెక్టరేట్‌లో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పీజీఆర్ఎస్ సెల్ ఏర్పాటు చేశామని, అంతే కాకుండా ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఫిర్యాదులపై అర్జీలు అందజేయవచ్చన్నారు.

నవతరానికి స్ఫూర్తిదాత భగత్‌సింగ్



పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: నేటి నవతరానికి భగత్‌సింగ్ స్ఫూర్తిదాత అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాకుడు సంజీవ నాయుడు తెలిపారు. ఈ మేరకు మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాల వయస్సులో బ్రిటిష్ పాలకులపై కసితో తన యవ్వనాన్ని దేశానికి అంకితం చేసి దేశభక్తి చాటుకున్నారని కొనియాడారు. మహాత్ముని పిలుపుతో 14 సంవత్సరాలకే సహాయనిరాకరణ ఉద్యమంలో అడుగు పెట్టారని, ఆయన త్యాగాలను మరవలేమన్నారు. అటువంటి మహానుభావుని స్మరించుకోవడం మన అందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో కె.ఈశు దొరబాబు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి వెంకంపేట శివారులోని వై జంక్షన్ వద్ద రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తుపదార్థాలు, గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు, డ్రంకెన్ డ్రైవ్‌ను నివారించే లక్ష్యంతో ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

గ్రామాల్లో గజరాజుల సంచారం

- అప్రమత్తతకు టామ్ టామ్!



పెదమరికి, చినమరికి గ్రామాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని మైక్‌లో సూచిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

పార్వతీపురం రూరల్: మండలంలోని చినమరికి గ్రామ పరిసరాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో అటవీశాఖ అధికారులు స్థానికులను అప్రమత్తం చేశారు. సమీప గ్రామాల ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఏనుగుల మానిటరింగ్ యూనిట్ అధికారి మణికంఠేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం రాత్రి గ్రామాల్లో మైక్‌ల ద్వారా టామ్ టామ్ వేయించారు. ఏనుగుల కదలికలపై అటవీశాఖ సిబ్బంది నుంచి సమాచారం తెలుసుకున్న తర్వాతే రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలని సిబ్బంది సూచించారు. ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని, రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

అన్నను దూషించినా పవన్ కల్యాణ్‌కు పట్టదా..

గుమ్మలక్ష్మీపురం: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో చిరంజీవిని ఇష్టానుసారంగా దూషించినా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పట్టకపోవడం సిగ్గుచేటని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెగాస్టార్ చిరంజీవిని ఇంటికి పిలిచి భోజనం పెట్టి ఆత్మీయత కనబరిచినా.. అవమానించారని పవన్‌కల్యాణ్ తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారన్నారు. తాజాగా అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ అవమానించినా, ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదన్నారు. పవన్‌కు అన్న గౌరవం కన్నా పదవే ముఖ్యంలా ఉందని ఎద్దేవా చేశారు. బాలకృష్ణకు ఇతరులను విమర్శించే స్థాయి లేదని, వెంటనే ఆయన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, హీరో చిరంజీవికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం..

- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ విక్రాంత్



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: కూటమి ప్రభుత్వంతో నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి కార్యకర్తల కోసం సిద్ధం చేసిన డిజిటల్ బుక్ ను పాలకొండలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం కక్షసాధింపు చర్యలు చేపడుతుందని ఆరోపించారు. సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కేవలం స్వార్థ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఈ అరాచక పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇటువంటి వారి సమస్యలను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. పార్టీ అధికారంలోనికి వచ్చిన వెంటనే కార్యక్తలకు న్యాయం చేస్తామని.. ఇప్పటికే ఈ విషయాన్ని జగన్ మోహనరెడ్డి స్పష్టం చేశారన్నారు. కార్యకర్తలు తమకు జరిగిన అన్యాయాన్ని ఈ డిజిటల్ బుక్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వెలమల మన్మథరావు, కనపాక సూర్యప్రకాశరావు, దమలపాటి వెంకటరమణనాయుడు, దుప్పాడ పాపినాయుడు, ఎదు లిల్లీపుష్పనాథం, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యక్తలు పాల్గొన్నారు.

నాడు సౌధాలు..
నేడు పిచ్చుకల గూళ్లు

- కూటమి ప్రభుత్వంలో కానరాని ఇళ్ల నిర్మాణాలు



నెలిపర్తి లే అవుట్ వద్ద ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న నాటి హౌసింగ్ ఎం.డి డా.జి.లక్ష్మీశా (ఫైల్)



నేడు నెలిపర్తి లే అవుట్‌లో నిలిచిన ఇంటి నిర్మాణం పక్కనే చెట్టు వద్ద దర్శనమిస్తున్న పిచ్చుక గూళ్లు

సాలూరు: కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోను పేదవాడి సొంతింటి కల సాకారానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు. సొంత స్థలాలు లేని పేదలకు ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి స్థలంతో పాటు ఇళ్లను మంజూరుచేసి ఇచ్చింది.

వేలాదిమందికి ఇళ్ల మంజూరు

సాలూరు పట్టణంలో టిడ్కో ఇళ్లతో పాటు గుమడాం, నెలిపర్తి లే అవుట్‌లలో వేలాది మందికి సొంత ఇంటి కల సాకారం దిశగా నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కృషిచేశారు. ఈ ఇళ్ల నిర్మాణం కోసం తాత్కాలిక రోడ్లు, బోర్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు.

దీన స్థితిలో నాటి నిర్మాణాలు

గత ప్రభుత్వంలో నెలిపర్తి లే అవుట్ వద్ద సుమారు 413 ఇళ్లు మంజూరు చేశారు. ఎన్నికల నాటికి సుమారు 180 ఇళ్లు పూర్తయి ప్రారంభోత్సవాలు జరగ్గా మరికొన్ని ఇళ్లు వివిధ దశల్లో నిలిచాయి. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఈ ఇంటి నిర్మాణాల్లో పురోగతి లేకుండాపోయింది. దీంతో క్రమేణా ఈ ప్రాంతం పిచ్చుకలకు ఆవాసాలుగా మారుతోంది. పిచ్చుకలు ఈ ప్రాంతాల్లో గూళ్లు కట్టుకుంటుండడం కనిపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద ప్రజల సౌధాలు, నేటి కూటమి ప్రభుత్వంలో పిచ్చుకల సౌధాలుగా నిలుస్తున్నాయంటూ పలువురు ప్రజలు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న పక్షుల ప్రేమికులు అంతరించిపోతున్న పిచ్చుకలు, వాటి గూళ్లను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షంతో పారుతున్న వరదనీరు




కృష్ణపల్లి శివారులో రొంపిల్లి సాగరం చెరువు నుంచి రహదారిపై పారుతున్న వరదనీరు



చినబొండపల్లి చెరువు నుంచి పంట కాలువల్లోకి వెళ్తున్న వరదనీరు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పరిసర ప్రాంతాలతో పాటు ఎగువనున్న ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల కొండలపై ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో దిగువ ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో చెరువుల నుంచి పంట కాలువల్లోకి వరదనీరు ఉధృతంగా పారుతూ దిగువ ప్రాంతాలకు వరదనీరు తరలుతోంది. ఈ క్రమంలో చినబొండపల్లి, వెంకంపేట, పెదబొండపల్లి, కృష్ణపల్లి, లక్ష్మీనారాయణపురం, పెదమరికి గ్రామాలతోపాటు పార్వతీపురం మండలంలోని మరికొన్ని గ్రామాల్లో వరదనీరుతో చెరువులు నిండి పంట కాలువల ద్వారా బయటకు ప్రవహిస్తున్నాయి.



లక్ష్మీనారాయణపురం వద్ద చెరువుల ద్వారా బయటకు ప్రవహిస్తున్న వరదనీరు